గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

● శాసన మండలి చైర్మన్‌ను కలిసిన తిమ్మాపురం గ్రామస్తులు

మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 30 : బస్వాపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న బీఎన్ తిమ్మాపురం గ్రామ సమస్యలను పరిష్కరించాలని భూ నిర్వాసితులు కోరారు. పీపీసీఎస్ మాజీ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి ఆధ్వర్యంలో భూ నిర్వాసితులు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని శాసన మండలి కార్యాలయంలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా గ్రామ సమస్యలను వివరించి వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన ఆయన ప్రభుత్వం ఇటీవల రూ.50 కోట్లు మంజూరు చేసిందని, మిగతా రూ.59 కోట్లు త్వరలోనే మంజూరు చేస్తుందని అన్నారు. వెంటనే రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి రూ.59 కోట్లు సాధ్యమైనంత తొందరలో మంజూరు చేయాలని కోరారు. బీఎన్ తిమ్మాపురం గ్రామ సమస్యలపై మంత్రి, ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీకి లేఖ రాశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఉడుత శారద, నాయకులు డొంకెన హరినాథ్, వలబోజు నర్సింహాచారి పాల్గొన్నారు.

ప్రజా విజయోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

● కలెక్టర్ హనుమంతరావు

గూగుల్ మీట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 30 : నేటి నుంచి 9వ తేదీ వరకు చేపట్టే ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల నిర్వహణపై డీసీపీ రాజేశ్‌చంద్ర, అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, గంగాధర్, సీఈఓ శోభారాణి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, జిల్లా అధికారులు, తాసీల్దార్లు, ఎంపీడీఓలతో శనివారం నిర్వహించిన గూగుల్ మీట్‌లో ఆయన మాట్లాడారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేస్తూ ఘనంగా నిర్వహించాలన్నారు. ఆయా శాఖల అధికారులకు కేటాయించిన తేదీల్లో ప్రణాళికాబద్ధంగా వారి శాఖల ద్వారా కార్యక్రమాలను నిర్వహించి రోజువారీ నివేదికలను డాక్యుమెంటరీ ద్వారా సమర్పించాలని ఆదేశించారు. కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలన్నారు. డిసెంబర్ 1న ప్రజా ప్రభుత్వం సంవత్సరంలో సాధించిన లక్ష్యాలపై విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక, ఉన్నత, ఇంటర్మీడియట్, డిగ్రీ స్థాయిల్లో వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించాలని సూచించారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయాలని, సంక్షేమ పథకాలపై ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

స్వచ్ఛభారత్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలి

● అదనపు కలెక్టర్ గంగాధర్

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గంగాధర్

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 30 : స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమాలను సమర్థవంతంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన జరిగిన నీరు, పారిశుధ్య కమిటీ సమావేశంలో 'మన మరుగుదొడ్డి – మన ఆత్మగౌరవం, 'మరుగుదొడ్డిని పరిశుభ్రంగా ఉంచుదాం – ఆరోగ్యంగా జీవిద్దాం' అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 31,504 మరుగుదొడ్లు స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమంలో నిర్మాణం పూర్తయ్యాయన్నారు. కొత్తగా మంజూరైన 663 మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. గ్రామానికి నాలుగు చొప్పున జిల్లాలో 1,712 కమ్యూనిటీ సోక్‌పిట్స్ నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, డీపీఓ సునంద, డీఎంహెచ్‌ఓ మనోహర్, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి నర్సింహారావు, డీఈఓ సత్యనారాయణ, ఇరిగేషన్ ఈఈ నర్సింహ, అదనపు డీఆర్‌డీఓ సురేశ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పిల్లలు లేనివారికి దత్తత ఒక వరం లాంటిది

● మహిళా, శిశు, వికలాంగుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి నర్సింహారావు

సమావేశంలో మాట్లాడుతున్న మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి నర్సింహారావు

భువనగిరి అర్బన్, నవంబర్ 30 : పిల్లలు లేనివారికి దత్తత ఒక వరం లాంటిదని మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి కె.నర్సింహారావు అన్నారు. దత్తత మాసం సందర్భంగా పట్టణంలోని బాలరక్ష భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో దత్తత తీసుకోవడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు లేనివారు పిల్లల దత్తత కోసం సీఏఆర్‌ఏ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అక్రమంగా దత్తత తీసుకుంటే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇప్పటి వరకు జిల్లాలో 50 మంది దరఖాస్తు చేసుకున్నారని, జిల్లా నుంచి 15 మంది పిల్లలు దత్తతకు వెళ్లారని చెప్పారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ కమిటీ సభ్యులు బండారు జయశ్రీ, రుద్రమదేవి, శివరాజు, ఇస్తారి, మల్లేశం, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే డాటా ఎంట్రీ 90శాతం పూర్తి

● జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి సామ్యూల్

డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి సామ్యూల్

ఆత్మకూరు(ఎం), నవంబర్ 30 : ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీ మండలంలో 90శాతం పూర్తయిందని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి సామ్యూల్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డాటా ఎంట్రీ కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతి కుటుంబ సభ్యుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఆయన వెంట కార్యాలయ సూపరింటెండెంట్ లోకేశ్వర్‌రెడ్డి, ఏఎస్‌ఓ సంతోష్‌కుమార్ ఉన్నారు.

ఓటరు జాబితాను పారదర్శకంగా చేపట్టాలి : ఆర్డీఓ


తాసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఆర్డీఓ కృష్ణారెడ్డి

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 30 : ఓటరు జాబితాను పారదర్శకంగా చేపట్టాలని ఆర్డీఓ ఎం.కృష్ణారెడ్డి అన్నారు. భువనగిరి తాసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించి ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే విధంగా బీఎల్‌ఓలు కృషి చేయాలన్నారు. 18 ఏండ్లు పూర్తయిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా చూడాలని సూచించారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఎలాంటి తప్పులు లేకుండా జాబితాను రూపొందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసీల్దార్ కల్యాణ్, ఎన్నికల డిప్యూటీ తాసీల్దార్ ప్రణయ్, ఆర్‌ఐ భద్రయ్య, సీనియర్ అసిస్టెంట్ లోకేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో భక్తుల సందడి

సత్యనారాయణస్వామి వ్రత పూజల్లో పాల్గొన్న భక్తులు

యాదగిరిగుట్ట, నవంబర్ 30 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సందడి నెలకొన్నది. కార్తిక మాసం చివరి శనివారం కావడంతో స్వయంభూ పంచనారసింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామునే మహిళలు దీపారాధనలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కొండ కింద సత్యనారాయణ స్వామి వ్రత మండపంలో భక్తుల సందడి కనిపించింది. సుమారు 974మంది దంపతులు వ్రత పూజల్లో పాల్గొన్నారని ఆలయ అధికారులు వెల్లడించారు. స్వామివారి మాఢవీధులు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల ప్రాంతాలు భక్తుల రద్దీ కనిపించింది. ఉదయం ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవార్లతోపాటు క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను చేపట్టారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి నిత్య తిరుకల్యాణతంతు జరిపించారు. ప్రధానాలయ ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా సువర్ణపుష్పార్చన నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ, సహస్రనామార్చన, తిరువారాధన, రాత్రికి శయనోత్సవం అత్యంత వైభవంగా చేపట్టారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. 38వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. స్వామివారి ఖజానాకు రూ.52,60,773 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలని ధర్నా

పిల్లాయిపల్లి గ్రామంలో ధర్నా చేస్తున్న గ్రామస్తులు, అఖిలపక్ష నాయకులు

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 30 : గ్రామస్తులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని మండలంలోని పిలాయిపల్లి గ్రామస్తులు శనివారం ధర్నా నిర్వహించారు. అంతకుముందు అఖిలపక్ష నాయకులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ బందారపు సుమలత, బందారపు లక్ష్మణ్‌గౌడ్ మాట్లాడుతూ పిలాయిపల్లి గ్రామంలో రంగనాయక గుడి స్థలాన్ని కుతాటి ప్రేమలత, యాదగిరి ఆక్రమించారని, ఈ విషయమై అడిగితే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు బనాయించారని అన్నారు. దేవాలయ స్థలాన్ని సంబంధిత అధికారులు పరిరక్షించాలని కోరారు. పెద్దల సమక్షంలో పరిష్కరించుకుందామంటే రూ.50 లక్షలు, 200 గజాల స్థలం, మూడెకరాల భూమి, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. అక్రమ కేసులు తొలగించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు రంగ విశ్వనాథం, తోట శ్రీనివాస్, కొంతం శంకర్, పడాల సతీశ్‌చారి, బీరెడ్డి సందీప్‌రెడ్డి, తోట బాబు, కట్ట భూపాల్‌రెడ్డి, మధు, రమణారెడ్డి, గుడిసెల భూషణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలి : సీఐటీయూ

సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పాండు

భువనగిరి అర్బన్, నవంబర్ 30 : గ్రామ పంచాయతీ కార్మికులకు మూడు నెలల వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు అన్నారు. పట్టణంలోని సుందరయ్య భవనంలో శనివారం నిర్వహించిన గ్రామ పంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం చెల్లించకుండా కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుంటుందన్నారు. ఏండ్ల తరబడి గ్రామాలను శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న కార్మికుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహిళా కన్వీనర్ పొట్ట యాదమ్మ, నాయకులు మంద యాదగిరి, మండల శ్రీను, బాలరాజు, యాదగిరి, బాబు, మణెమ్మ, ప్రమీల, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరస్వామి

తుర్కపల్లి, నవంబర్ 30 : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ తక్షణమే నెరవేర్చాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంజి వీరస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని జేఎం ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ఇస్తామని చెప్పి నేటికీ ఇవ్వలేదన్నారు. రైతులందరికీ తక్షణమే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికుల హక్కులను కాలరాయడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిగా పెట్టుకున్నాయన్నారు. ఉపాధి హామీ కార్మికులపై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మొండి వైఖరిని విడనాడాలని సూచించారు. అనంతరం సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెన్నూరి ప్రకాశ్, ప్రధాన కార్యదర్శిగా బాలరాజు, సహాయ కార్యదర్శులుగా రజిత, పెంటయ్య, ఉపాధ్యక్షులుగా పట్నం అంజయ్య, లక్‌పతి, స్వరూపతోపాటు సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో మండల కార్యదర్శి దుర్గయ్య, సత్తయ్య, భూమయ్య పాల్గొన్నారు.

గుంతల రోడ్లకు మరమ్మతు చేయాలి : డీవైఎఫ్ఐ

నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

రామన్నపేట, నవంబర్ 30 : గుంతలమయమై ప్రమాదాలకు నిలయంగా ఉన్న రామన్నపేట – కొమ్మాయిగూడెం రోడ్డుకు మరమ్మతులు చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు నాగటి ఉపేందర్ కోరారు. మండల కేంద్రంలోని కొమ్మాయిగూడెం రోడ్డులో ఏర్పడ్డ గుంతల వద్ద శనివారం డీవైఎఫ్ఐ నాయకులు నిలబడి నిరసన తెలిపారు. అనంతరం ఆర్ అండ్ బీ డీఈ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంతలమయంగా ఉన్న రోడ్లకు వెంటనే మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండలాధ్యక్షుడు శానగొండ రామచంద్రం, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్‌కుమార్, నాయకులు మల్లేశం, శ్రీనివాస్, మల్లేశం, మత్స్యగిరి పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల బంద్

బీబీనగర్, నవంబర్ 30 : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండలాధ్యక్షుడు లోకదాసు పవన్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ కేసులు వెలుగు చూస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. విద్యార్థి చనిపోయినా సరైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. విద్యా వ్యవస్థపై ముఖ్యమంత్రి తక్షణమే రివ్యూ చేసి ఈ తరహా ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫుడ్ పాయిజన్ ఘటనలపై సమగ్ర విచారణ జరిపించాలని, ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి మంద కిరణ్, విద్యార్థి నాయకులు బండారు భగత్, చరణ్, శివ పాల్గొన్నారు.

రామన్నపేట : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఉదయ్ మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయన్నారు. నాణ్యమైన భోజనం అందించకపోవడంతో గురుకులాల్లో 43మంది విద్యార్థులు మరణించారని, వేలాది మంది అస్వస్థతకు గురయ్యారని తెలిపారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు

అడ్డగూడూరు : మండలంలోని కంచనపల్లి గ్రామంలో గల కేజీబీవీ కళశాలలో గెస్ట్ మహిళా లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌ఓ సరిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజిక్స్, జువాలజీ సబ్జెక్ట్‌లను బోధించడానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత పత్రాలతో డిసెంబర్ 2నుంచి 3వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు కళాశాలలో హాజరు కావాలని పేర్కొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

భూదాన్ పోచంపల్లి : చదువు మధ్యలో మానేసిన వారి కోసం తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టీఓఎస్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ టెన్త్‌లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని పోచంపల్లి జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రాజారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చదువు మధ్యలో మానేసిన వారు అడ్మిషన్లు తీసుకొని కోర్సు పూర్తి చేసుకోవాలని సూచించారు. చదివిన రికార్డ్ షీట్‌తో ఓపెన్ 10వ తరగతిలో అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. డిసెంబర్ 11 ఆఖరు అని, వివరాలకు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో లేదా ఫోన్ నెంబర్ 8341 960246లో సంప్రదించాలని సూచించారు.

ప్రెస్ క్లబ్ భవనానికి స్థలం కేటాయించాలని ఆర్డీఓకు వినతి

చౌటుప్పల్ : ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఆర్డీఓ వి.శేఖర్‌రెడ్డికి శనివారం ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం కోసం పాత అంగడి ప్రాంతంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా అనువైన స్థలం ఉందని పేర్కొన్నారు. అక్కడ 500 గజాల స్థలాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సామిడి రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి దేశగోని శ్రీశైలం గౌడ్, ప్రతినిధులు హనుమంతురెడ్డి, రాములు, లింగస్వామి యాదవ్ పాల్గొన్నారు.

గాయపడిన యువకుడు మృతి

భువనగిరి కలెక్టరేట్ : పట్టణ పరిధి రాయగిరిలో విద్యుత్ షాక్‌కు గురైన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన వలస కూలీ వికాస్‌కుమార్ (23) గురువారం రాయగిరి స్టేషన్ సమీపంలోని ఇంటి పక్కన మూత్ర విసర్జనకు వెళ్లాడు. ఈ సమయంలో కోతుల గుంపు ఒక్కసారిగా రావడంతో భయంతో పరిగెత్తగా పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వికాస్‌కుమార్ శనివారం మృతిచెందాడు. మృతుడి అన్న దినేశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్లకు సన్మానం

ఆత్మకూరు(ఎం) : మండలంలోని మొరిపిరాల, కొరటికల్, ఆత్మకూరు(ఎం) గ్రామాల్లో సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన అంగన్‌వాడీ టీచర్లు జగజ్యోతి, అక్తరున్నీసా బేగం, సక్కుబాయితో పాటు ఆరుగురు ఆయాలను మండల కేంద్రంలోని మహిళా సమైక్య భవనంలో శనివారం సన్మానించారు. 42 సంవత్సరాలపాటు సేవలు అందించి విరమణ పొందిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు పింఛన్ సౌకర్యంతోపాటు నగదు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వాణిశ్రీ, టీచర్లు ధనమ్మ, శ్రీవాణి, జానకి, లక్ష్మీకళ, వరలక్ష్మి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

భువనగిరి కలెక్టరేట్ : మండలంలోని బస్వాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని సీపీఐ నాయకులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వంట చేసే ప్రదేశంలో మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా దుర్వాసన రాకుండా సమగ్ర చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఉడుత రాఘవులు, చిక్క భిక్షపతి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ప్రభుత్వ విప్ ఐలయ్య

కొలనుపాకలో ట్రాక్టర్‌పై కలెక్టర్ హనుమంతరావుతో కలిసి రైతు వేదికకు వెళ్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆలేరు రూరల్, నవంబర్ 30 : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. రైతు పండుగ వేడుకల్లో భాగంగా మండలంలోని కొలనుపాక రైతువేదికకు శనివారం ట్రాక్టర్‌పై కలెక్టర్ హనుమంతరావుతో కలిసి వెళ్లి సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. రుణమాఫీ చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఏఓ గోపాల్, మాజీ ఎంపీపీ గంధమల్ల అశోక్, నాయకులు కొండ్రాజు వెంకటేశ్వర్‌రాజు, గొట్టం విజయేందర్‌రెడ్డి, మోత్కూరి ఐలయ్య, ఎండీ ఇమ్రాన్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

డాటా ఎంట్రీ పరిశీలన

ఆలేరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, విద్య, కుల గణన సర్వే డాటా ఎంట్రీని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య శనివారం పరిశీలించారు. నిర్ణీత సమయంలో డాటా ఎంట్రీ పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక పంపించాలని సూచించారు. ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్, మాజీ ఎంపీపీ గంధమల్ల అశోక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులకు మేలు చేయడమే సర్కారు లక్ష్యం : ఎమ్మెల్యే సామేల్

అడ్డగూడూరు రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే మందుల సామేల్

అడ్డగూడూరు, నవంబర్ 30 : రైతులకు మేలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. రైతు పండుగలో భాగంగా శనివారం మహబూబ్‌నగర్‌లో జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి సభను మండల కేంద్రంలోని రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుంగతుర్తిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో ఏడీఏ పద్మావతి, ఏఓ పాండురంగాచారి, ఏపీఎం వెంకటేశ్వర్లు, ఏఈఓలు దయాకర్, అక్షర, నవనీత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి, డైరెక్టర్లు విద్యాసాగర్, సోమన్న, రైతులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి అనేక పథకాలు : ఎమ్మెల్యే కుంభం

అనాజీపురం రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, అధికారులు, రైతులు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 30 : రైతులకు మేలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తుందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని అనాజీపురం రైతు వేదికలో రైతుల పండుగ సందర్భంగా శనివారం ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ, సన్న ధాన్యానికి రూ.500 బోనస్, రైతు భరోసా, రైతు బీమా కార్యక్రమాలతో ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

ఇప్పళ్లలో గంధం ఊరేగింపు

గంధం ఊరేగింపులో ప్రభుత్వ విప్ ఐలయ్య

ఆత్మకూరు(ఎం), నవంబర్ 30 : మండలంలోని ఇప్పళ్ల గ్రామంలో ఖాజా నజీరొద్దీన్ బాబా దర్గా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గంధం ఊరేగింపు నిర్వహించారు. గంధం ఊరేగింపులో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్ గౌడ్, దర్గా నిర్వాహకులు బంధ వెంకటసాయి, నారాయణ, భక్తులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం

రమేశ్ భార్య సునీతకు ఇన్సూరెన్స్ బాండు అందజేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ యశోద

చౌటుప్పల్, నవంబర్ 30 : పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో 104లో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కొప్పోలు రమేశ్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. అతనిది నిరుపేద కుటుంబం కావడంతో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, 104 ఉద్యోగులు కలిసి రూ.1.50 లక్షలను సేకరించారు. ఈ నగదును మృతుడి భార్య సునీతకు డిప్యూటీ డీఎంహెచ్ఓ ఎల్.యశోద చేతుల మీదుగా శనివారం అందించారు. సునీతకు ఇన్సూరెన్స్ కూడా చేసి బాండ్‌ను ఇచ్చారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సీహెచ్ కాటంరాజు, ఆరోగ్య విశ్లేషణ అవగాహన అధికారి వసంత, సిబ్బంది మహేశ్, సురేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తా : మున్సిపల్ చైర్మన్

భువనగిరి అర్బన్, నవంబర్ 30 : మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని భువనగిరి మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని పురపాలక కార్యాలయ సమావేశ హాల్‌లో శనివారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎజెండాలో పొందుపర్చిన 15 అంశాలకు గాను 14 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని మురుగు కాల్వల మ్యాన్‌హోళ్లపై కవర్లు బిగించుట, ఎల్ఈడీ లైట్ల నిర్మాణం కోసం డ్రైవర్స్, సెన్సార్ కంట్రోలర్లు, కేబుల్ వైర్ల కొనుగోలు, సీసీ డ్రైన్లు, రోడ్ల నిర్మాణం, ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా కూడళ్లలో లైట్లతో అలంకరణ పనులను ఆమోదించామని చెప్పారు. పట్టణంలో అనుమతి లేకుండా కట్టడాలు జరిపిన వారికి మున్సిపాలిటీ నుంచి నోటీసులు జారీ చేశారని, అందులో కొంతమంది వద్ద మాత్రమే సంబంధిత రుసుం తీసుకోగా.. మిగతావారి వద్ద తీసుకోకుండా ఎలా అనుమతిస్తారని కమిషనర్ రామానుజులరెడ్డిని 5వ వార్డు కౌన్సిలర్ ఏవీ కిరణ్‌కుమార్ ప్రశ్నించారు. భువనగిరి మున్సిపాలిటీకి మాత్రమే ట్యాక్సీ చెల్లించడం ఎందుకని, పట్టణంలోని గాంధీ పార్కులో ఏర్పాటు చేసిన విగ్రహానికి రూ.10లక్షలు ఎలా అవుతాయని అడిగారు. అన్నింటికీ సంబంధించిన బిల్లులు ఉన్నాయని కమిషనర్ తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న తాసీల్దార్ మహేందర్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 30 : వనస్థలిపురం వాస్తవ్యుడు హబీబ్‌అలీ అందజేసిన సుమారు 15వేల విలువైన 45 దుప్పట్లను బీసీ బాలుర వసతి గృహం విద్యార్థులకు తాసీల్దార్ మహేందర్‌రెడ్డి శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఇటీవల తాసీల్దార్ రాత్రి బస చేసిన సమయంలో విద్యార్థులకు సరిగా రగ్గులు లేకపోవడంతో దాత సహాయంతో అందరికీ రగ్గులను పంపిణీ చేశారు. బీసీ హాస్టల్‌కు ఇన్వర్టర్ కూడా ఇస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, హాస్టల్ వార్డెన్ కరుణశ్రీ పాల్గొన్నారు.